క్లుప్తంగా

నేడు గ్రీవెన్స్ రద్దు

అరకులోయటౌన్: అరకులోయ, అనంతగిరి మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ రద్దు చేసినట్టు ఎంపీడీవోలు అడపా లవరాజు, ఎ.వి.వి.కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరకులోయ, దుంబ్రిగుడ మండలాల్లో ఈనెల 7న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో గ్రీవెన్స్ రద్దు చేసినట్లు వారు తెలిపారు. ఆయా మండలాల ప్రజలు గమనించాలని వారు కోరారు. ఉప ముఖ్యమంత్రి అరకులోయ పర్యటన నేపథ్యంలో విశాఖ నుంచి రోడ్డు మార్గంలో వస్తుండడంతో అనంతగిరి వారపు సంతను సోమవారం రద్దు చేస్తున్నట్టు అనంతగిరి ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న దాత సత్యనారాయణ

కొయ్యూరు: మండల కేంద్రంలోని ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వంజరి ఆంజనేయులు బాధిత కుటుంబానికి దాతలు సాయం అందించారు. ఇందులో భాగంగా స్థానిక రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ, అతని స్నేహితుడు హైదరాబాద్‌కు చెందిన సూర్యనారాయణ సహకారంతో రూ.10,116లను అగ్ని ప్రమాద బాధితుడు ఆంజనేయులుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాత సత్యనారాయణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారు. దుమంతి రామకృష్ణ, కాటం రమణ, బచ్చలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బేసు, ఎంపీటీసీ నాగరాజు

హుకుంపేట: గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నట్టు సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు అన్నారు. మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేటలోని జొడిగూడ గ్రామంలో తాగునీటి బోరు ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామాల్లో తాగునీటి సమస్యను గుర్తించి, పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రేమజంటకు వివాహం



ప్రేమ వివాహాన్ని జరిపించిన జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, పండా రామకృష్ణ తదితరులు

రంపచోడవరం: మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ ఇవ్వంపల్లి గ్రామానికి చెందిన కత్తుల భూమమ్మకు, గంగవరం మండలం రాజంపాలెం గ్రామానికి చెందిన కలుముల పోతురాజుదొరలకు రంపచోడవరం జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పండా రామకృష్ణదొరలు ఆదివారం ప్రేమ వివాహం జరిపించారు. రాజంపాలెంలోని రామాలయం వద్ద ప్రేమజంటకు గ్రామపెద్దల సమక్షంలో వివాహం జరిపించి నవవధువరులను ఆశీర్వదించారు.

8న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చింతపల్లి: మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 8న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ ఇంటర్వ్యూలకు అర్హులైన దరఖాస్తు చేసుకొన్న 41 మందితో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. ఈ ఇంటర్యూలు యూనియన్ బ్యాంక్, గ్రామీణ వికాస బ్యాంక్ మేనేజర్లు సమక్షంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. లబ్ధిదారులు విధిగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

రామాలయానికి పల్లకి వితరణ

పాయకరావుపేట: పాల్తేరు రామాలయానికి న్యాయవాది రాంబాబు టేకు కలపతో చేసిన పల్లకిని వితరణగా అందించారు. గ్రామంలోని మెరక వీధిలో రామాలయానికి ఆయన తన సొంత నిధులతో తయారు చేయించి ఆలయ కమిటీకి అందించారు. సీతారాముల ఉత్సవాలకు, ఊరేగింపులకు పల్లకి ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు అభినందించారు.



ముంచంగిపుట్టులో పూజలు చేస్తున్న భక్తులు



పానిరంగినిలో వేడుకలో పాల్గొన్న భక్తులు



జి.మాడుగులలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం



కొంతిలిలో పూజలు చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



గంపరాయిలో ప్రత్యేకాలంకరణలో సీతారాముల విగ్రహం



కొయ్యూరులోని భక్తుల కోలాటం



జి.మాడుగులలో హోమం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి దంపతులు

- అంగరంగ వైభవంగా శ్రీరామనవమి సంబరాలు
- భక్తులతో కళకళలాడిన రామాలయాలు
- గ్రామాల్లో మార్మోగిన రామనామం



చౌడుపల్లిలో శ్రీరాములు వారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మహిళలు



మోతుగూడెంలోని వేడుకలో పాల్గొన్న భక్తులు



రంపచోడవరంలోని వేడుకల్లో పాల్గొన్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, భక్తులు



పవనగిరి క్షేత్రంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పురుషోత్తపట్నంలో సీతారాముల విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కూనవరంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరకులోయటౌన్: మన్యంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా ఆదివారం జరిగాయి. వాడవాడలా రాములోరి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. రామాలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తులకు గోత్ర నామాలతో పూజలు చేశారు. శ్రీరాములు వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు పానకాన్ని అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అనంతరం పురవీధుల్లో ఉత్సవ మూర్తులను మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాటం, థింసా నృత్యాలతో, బాణసంచా కాల్పులతో ఊరేగించారు.

- అరకులోయ మండలంలో పానిరంగిని, కొత్తవలస, దళపతిగుడ, అనంతగిరి మండలంలోని గుమ్మకోట రామాలయంలో ఘనంగా సీతారాముల కల్యాణ వేడుక నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, గణేశ్వరరావు దంపతులు, భక్తులతో కలిసి పూజలు చేశారు.

హుకుంపేట: మండలంలోని కొంతిలిలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అడ్డుమండలో సర్పంచ్ గుమ్మా శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పెదబయలు: మండల కేంద్రంతో పాటు గంపరాయి, గుంజివాడ, గసాబు, పన్నెడ, లక్ష్మీపేట గ్రామాల్లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు జరిగాయి.

కొయ్యూరు: మండలంలోని సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు సింహాచలం, మాకాడ బాలరాజు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షులు అంబటి నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు

జి.మాడుగుల: మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జి.మాడుగులలోని రామాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, సన్యాసినాయుడు దంపతులు హోమం నిర్వహించారు. మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, రూపవతి దంపతులు, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, పద్మ దంపతులు భక్తులతో కలిసి పూజలు చేశారు. పాలకపాటి గురుదేవుల ఆలయంలో పూజలు చేశారు.

చింతపల్లి: మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు దంపతులు పాల్గొనగా, చౌడుపల్లిలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ లొంజా మహేంద్ర దంపతులు శ్రీరాములు వారికి పట్టు వస్త్రాలను సమర్పించి వేడుకలో పాల్గొన్నారు.

రంపచోడవరం/మోతుగూడెం: మండల కేంద్రంలోని సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు పాల్గొన్నారు. మోతుగూడెంలోని కోదండ రామాలయంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు దంపతులు, ఎస్‌సీఓఎంఎం చినుకామేశ్వరరావు దంపతులు, ఈఈ వరప్రసాద, ఏడీఈ కొండబాబు దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలోని రామాలయాలతో పాటు పవనగిరి క్షేత్రంలో కనులపండువగా సీతారాముల కల్యాణ వేడుకలు జరిగాయి. తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఎటపాక: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎటపాకలోని జటాయువు మండపం, ఉష్ణగుండాల్లో భక్తులు కానరాలేదు. భద్రాద్రిలో జరిగిన సీతారాముల కల్యాణంను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఏటా ఈ రెండు దర్శనీయ స్థలాలను సందర్శిస్తారు. అయితే ఈ ఏడాది ఉష్ణగుండాల వద్ద గోదావరి నదిలో వేడినీరు వచ్చే ప్రాంతంలో బావిని తవ్వలేదు. అదే విధంగా జటాయువు మండపం వద్ద కూడా స్వామి వారి కల్యాణం నిర్వహించక పోవడంతో భక్తులు తీవ్ర నిరాశ చెందారు.

కూనవరం: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గంగవరం: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణ వేడుకలో సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఎస్ఐ బి.వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు. మళ్ల బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



చింతపల్లిలో సీతారాముల కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు



కొత్తవలస ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జి.మాడుగులలో మహిళల కోలాటం



గంగవరంలో సీతారాముల కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తులు



రాజవొమ్మంగిలో పూజలు చేస్తున్న భక్తులు



కిండంగిలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త సింహాచలంనాయుడు, భక్తులు

అధ్వాన రహదారులతో అవస్థలు



గేటువలస నుంచి దుంబ్రిగుడ చాపరాయి రహదారి దుస్థితి

- గ్రామాల్లో రాళ్లు తేలి, గోతుల దారులు
- రాకపోకలకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



రాళ్లుతేలిన గన్నెల జంక్షన్ నుంచి గన్నెల గ్రామ రహదారి

అరకులోయటౌన్: గిరిజన ప్రాంతంలో సరైన రహదారులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారులు అధ్వానంగా ఉండడంతో రోజూ రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. మండలంలోని గన్నెల జంక్షన్ నుంచి గన్నెల వరకు రహదారి శిథిలమైంది. ఈ రహదారి మీదుగా కొత్తభల్లుగుడ, పెదలబుడు, బొండాం, గన్నెల, ఇరగాయి, మాదల, లోతేరు పంచాయతీల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సుంకరమెట్ట గేటువలస నుంచి జనంగుడ, మాడగడ, చొంపి, శిరగాం పంచాయతీ మీదుగా దుంబ్రిగుడ చాపరాయి రహదారి దారుణంగా మారింది. పెద్ద పెద్ద గోతులతో రాళ్లు తేలి దర్శనమిస్తుంది.ఈ రహదారిలో అరకులోయ మండలంలోని ఆరు పంచాయతీ ప్రజలతో పాటు దుంబ్రిగుడ మండలవాసులు రాకపోకలు సాగిస్తుంటారు. తరచూ గోతుల్లో పడి వాహనచోదకులు గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడినపుడు పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ రహదారి సమస్యపై పలుమార్లు అధికారులకు సమస్య విన్నవించినా పట్టించుకోలేదంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రోడ్డు బాగు చేయాలి



గన్నెల–సుంకరమెట్ట రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన రోడ్డు ప్రస్తుతం దారుణంగా ఉంది. కనీసం నడిచి వెళ్లలేని విధంగా మారింది. సంతకు వెళ్లాలన్నా, రోజు మండల కేంద్రం నుంచి స్వగ్రామాలకు రావాలన్నా తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి దారి బాగు చేయాలి.

– శెట్టి ఆనందరావు, గన్నెల గ్రామం, అరకులోయ

ప్రతిపాదనలు పంపాం



మండలంలో శిథిలావస్థకు చేరిన రహదారులు మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం అనుమతించి నిధులు విడుదల చేసిన వెంటనే రహదారులు బాగు చేస్తాం.

– రాముమ్, డీఈఈ, పీఆర్ ఇంజినీరింగ్‌శాఖ, అరకులోయ

వేడుకగా ఊంజల్ సేవ

కోటకోట: స్థానిక గవరపేటలో ఊయల సేవ, పుష్పాంజలి, పవళింపు సేవ ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. శ్రీరామనవమి పురస్కరించుకొని కల్యాణోత్సవ సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు చోడమాంబిక పుట్టుక జాతర

అచ్యుతాపురం రూరల్: చోడపల్లిలో చోడమాంబిక పుట్టుక జాతర మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ వడిశల నాయుడు తెలిపారు. ఇక్కడ వేకువజాము మూడు నుంచి నాలుగు గంటల ప్రాంతంలో చోడమాంబిక ఆలయం వెనుక కొండపై మెరుపుల్లో భక్తులకు అమ్మవారు దర్శమిస్తారు. అప్పటి వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు రాత్రంతా జాగారం ఉంటారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల పాటు నిరాటంకంగా మందుగుండు సామగ్రి కాలుస్తారు. ఇప్పటికే వీధులన్నీ విద్యుత్ దీపాలంకరణతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. ఈ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి రానున్నారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరబాబు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సమీపంలోని రవీంద్రనగర్‌కు చెందిన కొమారి వీరబాబు (35) వేపచెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతూ శనివారం జారి పడ్డాడు. ఈ విషయం ఆలస్యంగా ఆదివారం తెలిసింది. ఈ సంఘటనలో అతడి మెడ, తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కూలి పనిచేస్తు జీవిస్తున్న వీరబాబుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పాడేరులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న శాంతకుమారి

పాడేరు రూరల్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లగిసపల్లిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ట్రైకార్ బోర్డు సభ్యుడు కృష్ణారావు, నాయకులు రాజారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

గంగవరం: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో మండల పార్టీ అధ్యక్షురాలు పుట్టపల్లి నీలాలమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. నాయకులు వెంకటేశ్వర్లు దొర, సూర్యచంద్ర, శ్రీను, పోతురాజు దొర, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నిరాశతో పర్యాటకుల నిరీక్షణ



చాపరాయిలో ప్రవేశం లేకపోవడంతో ముఖద్వారం వద్ద పర్యాటకులు నిరాశతో నిరీక్షణ

దుంబ్రిగుడ: మండలంలోని ప్రముఖ సందర్శక ప్రాంతం చాపరాయిలో ప్రవేశాలు రద్దు చేశారు. మండలంలో సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో ఆది నుంచి పర్యాటకుల ప్రవేశాలను రద్దు చేయడంతో నిరాశతో వెనుదిరిగారు. సెలవు రోజుల్లో మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో కిటకిటలాడే చాపరాయి పర్యాటక ప్రాంతం బోసిపోయింది.